TRUTH | PEOPLE | NATION

ప్రజల పక్షం.. ప్రజా స్వరం..

# రిపబ్లిక్ హిందుస్థాన్

REPUBLIC HINDUSTHAN TELUGU DAILY

NEWS VIEWS FOR A BETTER TOMORROW

సత్యం కోసం.. సమాజం కోసం.. భారతం కోసం..

సంపుటి: 2 సంచిక: 137 | మంగళవారం 06-10-2026 | ఆదిలాబాద్ | హైదరాబాద్ | ఎడిటర్ : రాఠోడ్ రాజు | పేజీలు : 4 | వెల: రూ.2.00



2వ పేజీలో...

## సెల్ఫ్ గోల్ రాజకీయంతో

# రేవంత్

హైదరాబాద్, : కాంగ్రెస్ పార్టీ మత రాజకీయాలను సరికొత్త కోణంలో ప్రమాదకరమైన ప్రయోగానికి తెరలేపింది. భారతీయ జనతా పార్టీ సుదీర్ఘకాలంగా నిర్మించుకుంటూ వస్తున్న హిందూత్వ ఓటు బ్యాంకుకు విరుగుడు కనిపెట్టే ఆత్రుతలో కాంగ్రెస్ నాయకత్వం సరికొత్త వివాదాలకు ఆజ్యం పోస్తోంది. గతంలో పార్లమెంట్‌లో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భగవాన్ శివుడి చిత్రాన్ని ప్రదర్శిస్తూ ప్రసంగించిన బాటలోనే.. తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వేదికగా ఆర్య-ద్రావిడ వాదాన్ని, శైవం-వైష్ణవం పేరిట దేవుళ్లకే వర్గ విభజన ఆపాదిస్తూ చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి.



## ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదని

# సుప్రీంకోర్టు స్పష్టీకరణ

- మార్పు ఎవరు చేశారో తెలుసుకుంటామన్న సీజేఐ
- రికార్డులు చూశాకే పూర్తిస్థాయి విచారణ ఉంటుందని వెల్లడి
- ఫారమ్-6ను సవరించలేదని ఈసీ స్పష్టీకరణ
- 'సర్' కోసం అదనపు డిక్లరేషన్ మాత్రమే చేర్చామని వెల్లడి

ఢిల్లీ: కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్-6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరించిన ఫారమ్-6కు తాము అనుమతి ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు. ఫారమ్-6లో అసలు మార్పు జరిగిందా? జరిగితే ఎవరు చేశారు? అనే విషయాలను తేల్చాల్సి ఉందని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాతే అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని సీజేఐ చెప్పారు. "సవరించిన ఫారమ్-6ను మేం ఆమోదించలేదు. ఇది స్పష్టం" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు.



2వ పేజీలో...

## భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్

# కీలక వ్యాఖ్యలు

- భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్ధత ఏర్పడిందన్న నిర్మలా సీతారామన్
- ప్రస్తుతం వాణిజ్యం భారత్‌కే అనుకూలంగా ఉందని వెల్లడి
- వాణిజ్య లోటును తగ్గించుకోవాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్య
- ఈయూ ఒప్పందాన్ని విజయవంతమైన ఉదాహరణగా చూపిన ఆర్థిక మంత్రి

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నిర్ణయాలపై పిటిషన్లు కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు

కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు
- సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం విచారణ
- కేంద్ర ప్రభుత్వం, ఈసీకి వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులు
- ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాల్లో సీఈసీ ఒంటరిగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణ
- చట్టవిరుద్ధమైన నిర్ణయాలు ఉంటే రద్దు చేస్తామన్న సుప్రీంకోర్టు ధర్మాసనం
- సీఈసీ విధులకు ఆటంకం కలిగించేలా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరణ





2వ పేజీలో...



2వ పేజీలో...

## రక్షకులే రాక్షసుల్లా

# మారితే ఎలా..?

## బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

**రాహుల్‌గాంధీ**

## యూపీ రాజ్యసభ ఎన్నికలకు 8 మంది అభ్యర్థులను ప్రకటించిన

# బీజేపీ

- కేంద్ర మంత్రులు హర్దీప్ పురి, బీఎల్ వర్మలకు దక్కని అవకాశం



2వ పేజీలో...

## కేబీఆర్ పార్క్ చుట్టూ

# వన్ వే సక్సెస్

## 1,090 కోట్ల స్టీల్ బ్రిడ్జీలు, అండర్‌పాస్‌ల రద్దు

హైదరాబాద్, అక్టోబరు 5, : హైదరాబాద్ కేబీఆర్ పార్కు చుట్టూ ఏడు కూడళ్లలో చేపట్టాలని భావించిన రూ. 1,090 కోట్ల స్టీల్ బ్రిడ్జీలు, అండర్ పాస్‌ల ప్రాజెక్టును జీహెచ్ఎంసీ రద్దు చేసింది. వన్‌వే విధానం అమలు చేసిన తర్వాత ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గడంతో భారీ వ్యయంతో నిర్మాణాలు చేపట్టడం అవసరం లేదని ప్రభుత్వం భావించింది. జూబ్లీ చెక్ పోస్టు, కేబీఆర్ పార్కు గేట్, ముగ్ధా జంక్షన్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో పనులను నిలిపివేశారు. కాంట్రాక్టర్లు కేఎన్ఆర్, మేఘాతో చేసుకున్న ఒప్పందాలను కూడా రద్దు చేశారు. ఇదే సమయంలో పంజాగుట్ట నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వరకు కొత్త ఎలివేటెడ్ కారిడార్‌కు మార్గం సుగమమైంది. హైదరాబాద్ నగరానికి కీలకమైన కేబీఆర్ పార్కు చుట్టూ ఏడు ప్రధాన కూడళ్లలో చేపట్టాలని ప్రతిపాదించిన స్టీల్ బ్రిడ్జీలు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి బ్రేక్ పడింది. మొత్తం..

హైదరాబాద్, : ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ వైపు అడుగులు వేసి ఎంపీగా పోటీ చేయడంతో ముంచుకొచ్చిన ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నిక తెలంగాణ రాజకీయాల్లో ఊహించని మలుపులు తిరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి, తెలంగాణ రక్షణ సేన పేరుతో కొత్త రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కల్వకుంట్ల కవిత.. ఈ ఉపఎన్నిక బరిలో తమ పార్టీ అభ్యర్థిని దించుతామని ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎదుర్కొంటున్న తొలి ఎన్నిక కావడంతో, ఖైరతాబాద్ పోరు తెలంగాణ రక్షణ సేనకు తమ ఉనికిని, క్షేత్రస్థాయి ప్రాభవాన్ని చాటుకునే ప్రతిష్టాత్మక పరీక్షగా మారనుంది.ఈ ఎన్నికల్లో కవిత నేతృత్వంలోని పార్టీకి ప్రధాన లక్ష్యం తక్షణమే సీటును కైవసం చేసుకోవడం కాకపోవచ్చు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల త్రిముఖ పోటీ మధ్య తమకంటూ ఒక ప్రత్యేకమైన ఓటు బ్యాంకు, సిద్ధాంతపరమైన స్థానం ఉందని నిరూపించుకోవడమే ఆమె అసలైన పొలిటికల్ ఎజెండాగా కనిపిస్తోంది. బిఆర్ఎస్ నుంచి సస్పెన్షన్, జైలు జీవితం తర్వాత "సామాజిక తెలంగాణ" నినాదంతో ప్రజాక్షేత్రంలోకి వచ్చిన కవితకు.. హైదరాబాద్ నడిబొడ్డున జరిగే ఈ బైపోల్ ఒక లిట్మస్ టెస్ట్ లాంటిది. ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇస్తూ ఓట్లను రాబట్టగలిగితే, రాబోయే స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికలకు టీఆర్ఎస్‌ను ఒక ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టే అవకాశం దక్కుతుంది.ఖైరతాబాద్ నియోజకవర్గ భౌగోళిక, సామాజిక సమీకరణాలు పరిశీలిస్తే ఇక్కడ పోటీ అత్యంత విలక్షణంగా ఉంటుంది.



2వ పేజీలో...

## ఖైరతాబాద్ బరిలో

# కవిత పార్టీ..!

# ఖైరతాబాద్ బరిలో కవిత పార్టీ..!



**మొదటిపేజీ తరువాయి...**

బస్తీల్లో ఉండే శ్రామిక వర్గాలు, కాలనీల్లోని మధ్యతరగతి ప్రజలు, హైటెక్ ఉద్యోగులు, ఐటీ ఆధారిత వ్యాపారవేత్తలు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో ఇక్కడ నివసిస్తున్నారు. స్థానికంగా మంచి పట్టుండి, ప్రజాదరణ పొందిన బలమైన అభ్యర్థిని బరిలోకి దించగలిగితే తెలంగాణ రక్షణ సేన ప్రధాన పార్టీల గెలుపోటములను ప్రభావితం చేసే కింగ్ మేకర్ గా మారే ప్రభావం చూపుతుంది. ఈ ఉపఎన్నికలో కవితకు అతిపెద్ద ప్లస్ పాయింట్ మహిళా ఓటర్లు. గతంలో తెలంగాణ జాగృతి ద్వారా బతుకమ్మ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయడం, మహిళా సాధికారత అంశాలపై పోరాడటం వల్ల తెలంగాణ సెంటిమెంట్‌తో పాటు మహిళల్లో ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది.

ఖైరతాబాద్ వంటి అర్బన్ నియోజకవర్గంలో మహిళా ఓటర్ల శాతం అధికంగా ఉండటం వల్ల.. ధరల పెరుగుదల, ఉచిత బస్సు ప్రయాణాల అమలు తీరు, మహిళా భద్రత, స్థానిక సమస్యలపై ఆమె చేసే ప్రచారం మహిళల ఓట్లను ఆకర్షించే అవకాశం ఉంది. ఇది అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ల సాంప్రదాయ మహిళా ఓటు బ్యాంకుకు గండికొట్టడం ఖాయంగా కనిపిస్తోంది.దానం నాగేందర్ పార్టీ మార్పు , రాజ్యాంగబద్ధమైన పదవుల దుర్వినియోగంపై కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఒక గుర్తుపై గెలిచి మరొక పార్టీకి వెళ్లడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమే అని ప్రజల్లోకి తీసుకెళ్తూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, బీఆర్ఎస్ అంతర్గత ఒప్పందాలను ఒకేసారి ఎండగట్టే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. రాజధాని నగరంలోని విద్యావంతులు, తటస్థ ఓటర్లు ప్రజాస్వామ్య సూత్రాలకు ప్రాధాన్యమిస్తే.. ఈ రాజకీయం కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండింటికీ తలనొప్పిగా మారనుంది. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితాల సరళిని తలకిందులు చేసే శక్తి తెలంగాణ రక్షణ సేనకు ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గెలుపు ఓటముల కంటే కూడా, తాము సాధించే ఓట్ల శాతమే భవిష్యత్తులో తెలంగాణ రాజకీయాల్లో కవిత ఎంతవరకు ప్రభావం చూపగలరనే దానికి ప్రామాణికంగా నిలుస్తుంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు సైతం కవిత అభ్యర్థిత్వం , వ్యూహాలను తేలిగ్గా తీసుకోలేక, తమ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు కొత్త సమీకరణాలను తెరపైకి తెచ్చే పరిస్థితి ఏర్పడింది.

# సెల్ఫ్ గోల్ రాజకీయంతో రేవంత్

**మొదటిపేజీ తరువాయి...**

రాముడు ధనికుల దేవుడు-శివుడు పేదల దేవుడు.. ఉత్తరాది వారు ఆర్యులు, దేవుడిగా రాముడిని కొలిస్తే.. దక్షిణాది వారమైన మేము ద్రావిడులం, శివుడిని ఆరాధిస్తాం.. బీజేపీ రాముడిని హైజాక్ చేసింది అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపాయి. ఒక రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి, హిందూ దైవ కుటుంబంలో అత్యంత ప్రధానమైన శ్రీరాముడు, పరమశివుడి మధ్య పేద, ధనిక అంతరాలను సృష్టించడం విపరీతమైన విమర్శలకు దారితీసింది. ప్రాంతీయంగా ద్రావిడ వాదాన్ని ఎత్తుకుంటూనే, దైవ భావనకు కూడా వర్గ పోరాటం రంగు పులమడం కాంగ్రెస్ అనుసరిస్తున్న నూతన రాజకీయ విభజన వ్యూహానికి నిదర్శనమని భావిస్తున్నారు.హిందూ సమాజంలో చారిత్రకంగా అనేక సంప్రదాయాలు ఉన్నప్పటికీ, రాముడు, శివుడు అనే వ్యత్యాసాలు లేకుండా హరిహరులు గా కలిసి ఆరాధించే సంస్కృతి భారత్‌లో ఉంది. ముఖ్యంగా తెలంగాణలోనే భద్రాచలం శ్రీరాముడిని దక్షిణ అయోధ్య గా, వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దక్షిణ కాశీ గా సమానంగా పూజిస్తారు. ఇటువంటి పుణ్యక్షేత్రాలు ఉన్న ప్రాంతానికి చెందిన నేతలే.. రాజకీయ ప్రయోజనాల కోసం దేవుళ్లను ఉత్తర-దక్షిణ భాగాలుగా, ధనిక-పేద వర్గాలుగా విభజించడం వెనుక క్షేత్రస్థాయిలో రాజకీయ లబ్ధి పొందాలనే ఆరాటం స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా హిందూ సంప్రదాయాలను విభజించడం ద్వారా బీజేపీ ఏకీకృత హిందూ ఓటు బ్యాంకును దెబ్బతీయవచ్చని అంచనా వేస్తోంది.వ్యూహాత్మకంగా కాంగ్రెస్ వేస్తున్న ఈ అడుగులు ఆ పార్టీకే రివర్స్ అయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఇటువంటి భక్తి, విశ్వాసాల కేంద్రంగా జరిగే విభజన రాజకీయాలు ఆఖరికి బీజేపీకే రాజకీయంగా అత్యధిక ప్రయోజనాన్ని చేకూరుస్తాయి. హిందూ దేవుళ్లను రాజకీయాల్లోకి లాగి, వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా మెజారిటీ ఓటర్లలో కాంగ్రెస్‌పై ప్రతికూల భావన ఏర్పడేలా చేయడం



బీజేపీకి చాలా సులభమవుతుంది. ఈ వ్యాఖ్యలను అస్త్రంగా చేసుకుని కాంగ్రెస్ హిందూ వ్యతిరేక సిద్ధాంతాన్ని, నకిలీ సెక్యులరిజాన్ని పాటిస్తోంది అని బీజేపీ విస్తృతంగా ప్రచారం చేయడానికి అవకాశం లభిస్తుంది. హిందూత్వను నేరుగా ఎదుర్కోలేక, దానిని ముక్కలు చేసేందుకు శివుడు లబ రాముడు, ఉత్తరాది లబ దక్షిణాది సమీకరణాలు తేవడం వల్ల పోలరైజేషన్ జరుగుతుంది. ఇది కాంగ్రెస్‌కు ఉన్న లౌకిక లేదా తటస్థ ఓటర్లను కూడా దూరం చేసే ప్రమాదం ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తన ప్రాచీన ధార్మిక క్షేత్రాల పునర్నిర్మాణం ద్వారా ఇప్పటికే ఉత్తర-దక్షిణ తేడా లేకుండా విశ్వాసులలో స్థానం సంపాదించుకుంది. కాబట్టి దేవుళ్లను విభజించే యత్నం సాధారణ భక్తుల్లో ఆగ్రహాన్ని కలిగించి, ఓట్ల రూపంలో బీజేపీ వైపే దారితీస్తుందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ హిందూత్వ సిద్ధాంతానికి విరుగుడుగా తెస్తున్న ఈ విభజన కౌంటర్ వ్యూహం సెల్ఫ్ గోల్ అయ్యే అవకాశాలే ఎక్కువ. విశ్వాసాలను రాజకీయం చేసి, దేవుళ్లకు వర్గ భేదాలు ఆపాదించడం ద్వారా కాంగ్రెస్ సాధించేదనకంటే కోల్పోయేదే ఎక్కువని తెలంగాణ రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. భావజాల పరంగా స్పష్టమైన ప్రత్యామ్నాయాన్ని ప్రజల ముందు ఉంచకుండా, ఇటువంటి సున్నితమైన అంశాలను కెలికితే అది బీజేపీ నేతృత్వంలోని పోలరైజేషన్ వ్యూహానికి మరింత నెయ్యి పోసినట్లే అవుతుందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

# కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే సక్సెస్

**మొదటిపేజీ తరువాయి...**

రూ. 1,090 కోట్ల అంచనా వ్యయంతో రెండు ప్యాకేజీలుగా చేపట్టిన ఈ పనులను రద్దు చేయాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. నిర్మాణ పనులు ప్రారంభిస్తే కొంతకాలం పాటు నగరంలోని ప్రధాన మార్గాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడే అవకాశం ఉండటంతో అధికారులు ప్రత్యామ్నాయంగా వన్‌వే విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు.నెల రోజుల క్రితం అమలు చేసిన వన్‌వే విధానంతో మొదట్లో వాహనదారులు కొంత ఇబ్బంది పడ్డారు. అయితే ఒకట్రెండు రోజుల తర్వాత పరిస్థితి క్రమంగా మెరుగుపడింది. మూడో రోజు నుంచి ప్రధాన సిగ్నళ్ల వద్ద ఎక్కువసేపు నిరీక్షించాల్సిన అవసరం లేకుండా వాహనాలు సాఫీగా కదలడం ప్రారంభించాయి. దీంతో కేబీఆర్ పార్కు చుట్టుపక్కల ట్రాఫిక్ సమస్యను భారీ నిర్మాణాలు చేపట్టకుండానే పరిష్కరించే అవకాశం ఉందని అధికారులు భావించారు.ట్రాఫిక్ రద్దీ మెరుగుపడిన నేపథ్యంలో వందల కోట్ల రూపాయలు వెచ్చించి స్టీల్ బ్రిడ్జీలు, అండర్‌పాస్‌లు నిర్మించడం అవసరం లేదని ప్రభుత్వం నిర్ణయించింది.పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జీహెచ్‌ఎంసీ ప్రత్యేక అధికారి జయేశ్‌రంజన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ కూడా సమావేశంలో పాల్గొన్నారు.జూబ్లీ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు గేట్, ముగ్ధా జంక్షన్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి పరిసరాలతో పాటు ఇతర కూడళ్లలో ప్రతిపాదించిన నిర్మాణాలను రద్దు చేయాలని నిర్ణయించారు. ఆయా పనుల కోసం కేఎన్‌ఆర్, మేఘా సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేసేందుకు కూడా స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. దీంతో కేబీఆర్ పార్కు చుట్టూ భారీ నిర్మాణాలతో ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించిన పాత ప్రణాళికకు తెరపడింది. ఇదే సమయంలో పంజాగుట్ట నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వరకు కొత్త ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. పంజాగుట్ట ఎన్‌ఎఫ్‌సీఎల్ కూడలి నుంచి జూబ్లీ చెక్‌పోస్టు మెట్రో స్టేషన్ రోడ్డును, అంటే జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36ను కలుపుతూ ఆరు లైన్ల పైవంతెన నిర్మించనున్నారు. ఈ కారిడార్ సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవు ఉండనుంది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 3లోని ముఫకంజా విద్యాసంస్థల సమీపంలో పైవంతెనపైకి ఎక్కే వాహనాలు నేరుగా జూబ్లీ చెక్‌పోస్టు మెట్రో స్టేషన్ కిందకు చేరుకునేలా డిజైన్ రూపొందించనున్నారు. అదే విధంగా చెక్‌పోస్టు మెట్రో స్టేషన్ వద్ద కారిడార్‌పైకి ఎక్కే వాహనాలు ముఫకంజా కాలేజీ ప్రాంతంలో దిగేలా ఏర్పాట్లు చేయనున్నారు.బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1 వైపు వెళ్లే వాహనాల కోసం ఎలివేటెడ్ కారిడార్ నుంచి జలగం వెంగళరావు పార్కు వరకు ప్రత్యేక ర్యాంపును నిర్మించే ప్రతిపాదన కూడా ఉంది. ప్రస్తుతం డిజైన్ల రూపకల్పన పూర్తికావాల్సి ఉండటంతో ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం, నిర్మాణ విధానం, ఇతర సాంకేతిక అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. కేబీఆర్ పార్కు చుట్టూ ప్రతిపాదించిన పాత ప్రాజెక్టు రద్దు కావడంతో కొత్త ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ బాధ్యతను జీహెచ్‌ఎంసీ మేఘా సంస్థకు అప్పగించింది.ఈ మార్పుతో భారీ స్థాయి కూడళ్ల అభివృద్ధికి బదులుగా ట్రాఫిక్ రద్దు వేగవంతం చేసే ప్రత్యామ్నాయ మౌలిక వసతులపై దృష్టి సారించినట్లైంది. ముఖ్యంగా పంజాగుట్ట- బంజారాహిల్స్ జూబ్లీ చెక్‌పోస్టు మార్గంలో సిగ్నల్ ఆధారిత ట్రాఫిక్‌ను తగ్గించి, వాహనాల నిరంతర రాకపోకలకు అనువైన కారిడార్ ఏర్పాటు చేయడమే కొత్త ప్రణాళిక ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

# భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

**మొదటిపేజీ తరువాయి...**

డిల్లీ: భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన 'మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026'లో ఆమె మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది" అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించవచ్చని సూచించారు.భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది 'తల్లి లాంటి ఒప్పందం' అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

# యూపీ రాజ్యసభ ఎన్నికలకు 8 మంది అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ

**మొదటిపేజీ తరువాయి...**

డిల్లీ: ఉత్తరప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అనూహ్య నిర్ణయం తీసుకుంది. పదవీకాలం ముగియనున్న ఇద్దరు కేంద్ర మంత్రులతో సహా ఏ ఒక్క సిట్టింగ్ ఎంపీకి తిరిగి అవకాశం కల్పించకుండా, ఎనిమిది మంది కొత్త ముఖాలను బరిలోకి దింపింది. ముఖ్యంగా కేంద్ర మంత్రులు హర్దీప్ సింగ్ పురి, బీఎల్ వర్మలను పక్కనపెట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉత్తరప్రదేశ్ నుంచి ఖాళీ అవుతున్న 10 రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 16న పోలింగ్ జరగనుంది. అసెంబ్లీలోని బలాబలాల ప్రకారం బీజేపీ ఎనిమిది, సమాజ్‌వాదీ పార్టీ రెండు స్థానాలను గెలుచుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బీజేపీ తన ఎనిమిది మంది అభ్యర్థుల జాబితాను సోమవారం విడుదల చేసింది. ధర్మపాల్ సింగ్, రాధాకాంత్ ఓఝా, ప్రకాశ్ పాల్, విద్యాసాగర్ సోన్‌కర్, గోపీ కృష్ణ పాండే, ప్రియాంక సింగ్ రావత్, రామ్ ప్రతాప్ సింగ్ చౌహాన్, శ్రుతి గంగ్వార్‌లను అభ్యర్థులుగా అధిష్ఠానం ప్రకటించింది.

2027 ఎన్నికలే లక్ష్యంగా ఎంపిక: 2027లో జరగనున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీజేపీ ఈ అభ్యర్థులను ఎంపిక చేసినట్లు స్పష్టమవుతోంది. సామాజిక సమీకరణాలతో పాటు పార్టీ సంస్థాగత అనుభవానికి ఇందులో పెద్దపీట వేశారు. ఈ జాబితాలో ముగ్గురు ఓబీసీ, ఇద్దరు షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ), ముగ్గురు అగ్రవర్ణాల అభ్యర్థులు ఉన్నారు. వీరిలో ఇద్దరు మహిళలకు అవకాశం కల్పించడంవిశేషం. బారాబంకి మాజీ ఎంపీ ప్రియాంక సింగ్ రావత్, ఝార్ఖండ్ గవర్నర్ సంతోష్ గంగ్వార్ కుమార్తె శ్రుతి గంగ్వార్‌లను మహిళా అభ్యర్థులుగా ఎంపిక చేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్ పాల్, ప్రముఖ దళిత నేత, మాజీ ఎంపీ విద్యాసాగర్ సోన్‌కర్, అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెండుసార్లు పనిచేసిన రాధాకాంత్ ఓఝా వంటి వారికి ఈ జాబితాలో చోటు దక్కింది. ఈ నిర్ణయంతో పార్టీలో కింది స్థాయి నుంచి పనిచేస్తున్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు బీజేపీ సంకేతాలు పంపింది.

# సీఈసీ జ్ఞానేశ కుమార్ నిర్ణయాలపై పిటిషన్లు

**మొదటిపేజీ తరువాయి...**

డిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ అధికారాల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు నేడు విచారణ చేపట్టింది. ఇతర కమిషనర్లతో సంప్రదించకుండా సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లను స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫారం 6లో మార్పులు వంటి పలు కీలక నిర్ణయాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మిగతా ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా ఏకపక్షంగా తీసుకున్నారని పిటిషనర్లు ఆరోపించారు. ఎన్నికల సంఘం వంటి బహుళ సభ్యుల కమిషన్‌లో నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీ ప్రాతిపదికన జరగాలని, కానీ ఇక్కడ అలా జరగలేదని వారు కోర్టు దృష్టికి తెచ్చారు.ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఈసీ తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. "రాజ్యాంగబద్ధమైన సంస్థలు చట్టానికి లోబడి పనిచేయాలి. ఒకవేళ తీసుకున్న నిర్ణయాలు చట్టవిరుద్ధమని తేలితే, వాటిని రద్దు చేస్తాం" అని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే, సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ విధులకు ఆటంకం కలిగించేలా లేదా ఆయనను సస్పెండ్ చేసేలా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి కోర్టు నిరాకరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలను సీఈసీ ఒక్కరే కాకుండా, ముగ్గురు సభ్యుల కమిషన్ సంయుక్తంగా వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు తమ పిటిషన్‌లో కోరారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు నోటీసులతో ఈ వ్యవహారంపై కేంద్రం, ఈసీ ఎలాంటి వివరణ ఇస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

## ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదని సుప్రీంకోర్టు స్పష్టీకరణ

**మొదటిపేజీ తరువాయి...**

అయితే ఫారమ్-6ను సవరించలేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) కోసం కొత్త ఓటర్లకు అదనపు డిక్లరేషన్ మాత్రమే జత చేశామని వివరిస్తోంది. ఈ అదనపు ప్రకటనను జులైలో చేర్చారు. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పాత ఓటరు జాబితా వివరాలను అనుసంధానించాల్సి ఉంటుంది. ఫారమ్-6 రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్-1960లో భాగం. ఈ నిబంధనల్లో మార్పులు చేయాలంటే అధికారికంగా సవరణ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు 29న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ఈఅంశాన్ని లేవనెత్తారు. ఫారమ్-6మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ప్రతిపాదన తమ వద్ద లేదని న్యాయశాఖ ఆర్టీఐ సమాధానంలో చెప్పినట్లు ఆయన తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒంటరిగానే నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశంపైనా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. గత 10 నెలల్లో 'సర్'కు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఇటీవల ఓ కథనం వెలువడిన విషయం తెలిసిందే.

## ఓటును తొలగించడం రాజ్యాంగ విరుద్ధం - దానం నాగేందర్

హైదరాబాద్, :ఓటు హక్కును తొలగించడం రాజ్యాంగ విరుద్ధమని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఎమ్మెల్యేగా అనార్హత వేటు పడడంతో నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో దానం సుడిగాలి పర్యటన చేస్తున్నారు. స్థానిక వాసులతో సమావేశం అవుతూ సమస్యల పరిష్కారం పై దృష్టి సారించారు. కుందన్బాగ్ మెథరిస్ట్ కాలనీ, ఉమా నగరాల్లో స్థానిక కాలనీవాసులతో సమావేశం అయినా దానం అక్కడి సమస్యలు వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ఆయా ప్రాంతాలలో డ్రైనేజీ సమస్య, మంచినీటి సమస్యల పరిష్కారానికి దృష్టి సారించాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేయడంతో వాటర్ వర్క్స్ అధికారులను పిలిచి సమస్య పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ దేశవతంగా ఓటు చోరీ జరగడం విచారకరమని అన్నారు. వ్యక్తులుగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. ఓటు హక్కు తొలగినట్లు గుర్తిస్తే తక్షణమే అధికారులను ఓటును తిరిగి తీసుకోవాలని సూచించారు. ఓటు హక్కు లేని వారు ప్రశ్నించే హక్కు కోల్పోతారని అన్నారు. ఓట్ల తొలగింపు పై నియోజకవర్గ ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. విజయ రెడ్డి పిటిషన్ పై గతంలోనే తాను అఫిడవిట్ దాఖలు చేసినట్లు చెప్పారు.

# రక్షకులే రాక్షసుల్లా మారితే ఎలా..?

**మొదటిపేజీ తరువాయి...**

ఢిల్లీ : రక్షకులే రాక్షసుల్లా మహిళలపై అరాచకాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ అగ్రనేతాహులేగాంధీ మండిపడ్డారు. ప్రశ్నించే మహిళలను చూసి కేంద్ర హోంమంత్రి అమిత్‌షాఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. మహిళలను అణచివేసే ధోరణి ఢిల్లీలో స్పష్టంగా కనిపిస్తోందని ఆయన అన్నారు. ఢిల్లీ పోలీసులు ఇటీవల మహిళలపై దాడులు, దురుసు ప్రవర్తనకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో రాహుల్ తీవ్ర విమర్శలు చేశారు.బాధితులకు న్యాయం చేయాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇటీవల జర్నలిస్టులు షహీన్ ఖాన్, నఫీసా ఖాన్‌లతో జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. పోలీసులు దురుసుగా ప్రవర్తించారని జర్నలిస్టులు తనతో చెప్పి ఆవేదన వ్యక్తంచేశారని రాహుల్ తెలిపారు. కెమెరాలు లాక్కోవడంతోపాటు వారిని ఈడ్చుకెళ్లడం ఏంటని ప్రశ్నించారు. వారి ఫిర్యాదుపై కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని పేర్కొన్నారు.మహిళలు ఫిర్యాదు చేసేందుకు వెళ్తే.. పోలీస్‌స్టేషన్‌లోనే ఇలాంటి ఘటనలు జరగడం దారుణమని రాహుల్‌గాంధీ ఆవేదన వ్యక్తంచేశారు. రక్షించాల్సిన వారే వారికి ప్రమాదంగా మారుతున్నారని ఆరోపించారు. సాకేత్ పోలీస్‌స్టేషన్‌లోని సీసీటీవీ దృశ్యాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. కాగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఇటీవల పెద్దఎత్తున ఆందోళనలు జరిగాయి. ఈ సందర్భంగా మహిళా నిరసనకారులు, జర్నలిస్టులపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించారని తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

## తెలంగాణ సచివాలయానికి నిలిచిపోయిన మంచినీటి సరఫరా

హైదరాబాద్: తెలంగాణ సచివాలయానికి మంచినీటి సరఫరా నలిచిపోయింది. రూ. 50 లక్షల వాటర్ బిల్లులు బకాయి ఉండటంతో కాంట్రాక్టర్లు మంచినీటి సరఫరా నిలిపివేసారు. అయా పేషిల అధికారులు సిబ్బందికి ఎవరి వాటర్ బాటిల్స్ వారే తెచ్చుకోవాలని సూచించారు. నీటిని సరఫరా చేసే నాలుగు ప్రైవేటు ఏజెన్సీలకు సుమారు రూ. 50 లక్షల బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి వుంది. పాత బిల్లులు క్లియర్ చేస్తేనే వాటర్ క్యాన్లు సరఫరా చేస్తామని కాంట్రాక్టర్లు అంటున్నారు.

# కరిగిపోతున్న డాలర్ డ్రీమ్స్



అమెరికా వెళ్లాలి.. డాలర్ డ్రీమ్స్ నెరవేర్చుకోవాలి' అని భారత్‌లోని సగటు యువతలో చాలామంది ఆశపడుతూ ఉంటారు. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ట్రంప్ అక్కడి విదేశీ విద్యార్థులు, యువత ఆశలపై నీళ్లు చల్లడం ప్రారంభించారు.ఒకప్పుడు ఇంజినీరింగ్ పూర్తయిందంటే అమెరికాలో ఓఎస్.. ఆ తర్వాత అక్కడే ఉద్యోగం. ఇదే లక్ష్యంగా వేలాది మంది విద్యార్థులు భారీ మొత్తంలో డబ్బు ఖర్చు చేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి క్రమంగా మారుతోంది. అమెరికా వీసా నిబంధనల్లో మార్పులు, అక్కడి ఉద్యోగ మార్కెట్‌లో అనిశ్చితి, విదేశీ విద్యపై పెరుగుతున్న ఖర్చులు.. ఇవన్నీ విద్యార్థులను మరోసారి ఆలోచించేలా చేస్తున్నాయి.ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కొంత కాలంగా కనిపిస్తున్న కొత్త ట్రెండ్ ఇదే. గతంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌ను ఒక ఆప్షన్‌గా మాత్రమే చూసిన విద్యార్థులు.. ఇప్పుడు దానినే మొదటి ప్రాధాన్యతగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది.అమెరికాలో ఓఎస్ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి వెళ్లడం కంటే.. స్వదేశంలోనే ఉద్యోగం సంపాదించి రెండుమూడేళ్లు అనుభవం పొందితే ఎలా ఉంటుందనే ఆలోచన పెరుగుతోంది. ముఖ్యంగా కుటుంబంపై భారీ ఆర్థిక భారం పడకుండా ఉండటం, ఉద్యోగ భద్రత ఉండటం విద్యార్థులను క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ వైపు మళ్లిస్తోంది.ఈ మార్పు విద్యార్థుల ఆలోచనల్లోనే కాదు.. ఇంజినీరింగ్ కాలేజీల్లోనూ కనిపిస్తోంది. గతంలో చివరి ఏడాదిలో ప్లేస్‌మెంట్ కోసం సిద్ధమయ్యే విద్యార్థులు.. ఇప్పుడు రెండో సంవత్సరం నుంచే కోడింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ ప్రిపరేషన్‌పై దృష్టి పెడుతున్నారు.క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లకు ముందుగానే రిజిస్టర్ చేసుకుంటున్నారు. విదేశీ విద్యకు వెళ్లే ముందు ఉద్యోగందొరికితే.. ఆతర్వాత పరిస్థితులను బట్టి తదుపరి నిర్ణయం తీసుకోవచ్చని భావిస్తున్నారు.కానీ ఇక్కడా సవాళ్లు తప్పడం లేదు!విద్యార్థులు క్యాంపస్ ఉద్యోగాల వైపు మొగ్గుచూపుతున్నప్పటికీ.. రిక్రూట్‌మెంట్ మార్కెట్ మాత్రం అంత ఆశాజనకంగా కనిపించడం లేదు. గత మూడేళ్లలో అనేక కాలేజీల్లో క్యాంపస్‌కు వచ్చే కంపెనీల సంఖ్య తగ్గినట్లు విద్యాసంస్థలు చెబుతున్నాయి.ఒకప్పుడు కొన్ని కాలేజీలకు50 నుంచి 80వరకు కంపెనీలువచ్చేవని, ప్రస్తుతం కొన్ని చోట్ల ఆ సంఖ్య 20 నుంచి 30కి పడిపోయిందని చెబుతున్నారు. దీంతో ఉద్యోగం కావాలనే డిమాండ్ పెరుగుతున్న సమయంలో.. ఉద్యోగ అవకాశాల సంఖ్య మాత్రం తగ్గడం విద్యార్థులకు మరో సవాలుగా మారుతోంది.క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో మరో సమస్య కూడా విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తోంది. కొన్ని కంపెనీలు విద్యార్థులను ఎంపిక చేసి ఆఫర్ లెటర్లు ఇచ్చినప్పటికీ.. వెంటనే ఉద్యోగంలోకి తీసుకోకుండా నెలల తరబడి జాయినింగ్‌ను వాయిదా వేస్తున్న ఘటనలు కనిపిస్తున్నాయి.దీంతో ఉద్యోగం వచ్చిందనే సంతోషం ఉన్నా.. వాస్తవంగా ఎప్పుడు పని ప్రారంభిస్తామనే అనిశ్చితి విద్యార్థులను వెంటాడుతోంది. కొన్ని ప్రముఖ విద్యాసంస్థల్లోనూ ఇలాంటి ఆలస్యాలపై కంపెనీలకు సంబంధించి చర్యలు తీసుకున్న సందర్భాలు ఉండటం ఈ సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.అయితే విద్యార్థులు పూర్తిగా అమెరికా కలను వదులుకున్నారని చెప్పలేం. విదేశాల్లో చదువుకోవాలనే ఆసక్తి ఇంకా ఉంది. కానీ 'ముందు ఉద్యోగం.. తర్వాత విదేశీ ప్రయాణం' అనే వ్యూహం మాత్రం బలపడుతోంది.ఇండియాలో రెండుమూడేళ్లు పనిచేసి అనుభవం సంపాదించిన తర్వాత అమెరికా లేదా ఇతర దేశాలకు వెళ్లాలని కొందరు విద్యార్థులు భావిస్తున్నారు. ప్రారంభంలో జీతం తక్కువగా ఉన్నా.. చేతిలో ఉద్యోగం, అనుభవం ఉండటం వల్ల భవిష్యత్ నిర్ణయాలు తీసుకోవడం సులభమవుతుందని వారు భావిస్తున్నారు. ఒకప్పుడు విదేశీ విద్య అంటే అధిక జీతం, అమెరికా ఉద్యోగం, సెటిల్‌మెంట్ అనే కల కనిపించేది. ఇప్పుడు విద్యార్థులు రిస్క్, ఖర్చు, వీసా, ఉద్యోగ భద్రత వంటి అంశాలను కూడా లెక్కలోకి తీసుకుంటున్నారు. అందుకే అమెరికా వెళ్లడమే కెరీర్ విజయానికి ఏకైక మార్గం కాదనే భావన బలపడుతోంది. స్వదేశంలోనే మొదటి ఉద్యోగం సంపాదించి.. నైపుణ్యాలు పెంచుకుని.. అనుభవంతో తర్వాత విదేశీ అవకాశాలను పరిశీలించడం కొత్త కెరీర్ వ్యూహంగా మారుతున్నట్లు కనిపిస్తోంది.హెచ్–1బీ వీసా చార్జీలు అనూహ్యంగా పెంచడమే కాక, విద్యార్థి వీసాలపై వచ్చే వారిపై కఠిన నిబంధనలు విధించారు. దీంతో అక్కడ ఉంటున్న ఇండియన్స్ సహా ఇతర దేశస్థులకు ఉద్యోగ అవకాశాలు తగ్గడమే కాక, ఆ దేశానికి వచ్చే విదేశీ విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నది.హెచ్–1బీ వీసా కింద నియామకాలు తగ్గించి స్థానికులనే నియమించుకోవడం మెల్లిగా ప్రారంభించాయి. డాలర్ల సంపాదన లక్ష్యానికి ట్రంప్ దెబ్బకొట్టడంతో అమెరికాకు వెళ్లే భారత విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది. పోనీ ఎలాగోలా వెళ్దామని దరఖాస్తు చేసుకున్న వారిలో చాలామంది విద్యార్థుల వీసా దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. వీసాల తిరస్కరణ డాటాను పరిశీలిస్తే.. ప్రాంతాల వారీగా వాటిలో అసమానతలు పెరుగుతున్నాయన్న విషయం వెల్లడవుతున్నది. దీనివల్ల అమెరికాలో విద్యావకాశాలు యోగ్యత, ప్రతిభ కంటే భౌగోళిక పరిస్థితుల వల్లే ఎక్కువగా ప్రభావితమవుతున్నాయా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. అమెరికా విద్యావకాశాల విషయంలో ప్రాంతీయఅంతరం పెరుగుతున్నదని ఒక నివేదిక వెల్లడించింది. భారత దేశం సహా పాకిస్థాన్, నేపాల్, ఫిలిప్పీన్స్, కెన్యా, బ్రెజిల్, మెక్సికో, వియత్నాం, అర్జెంటీనా లాంటి గ్లోబల్ సౌత్ దేశాల నుంచి వచ్చే విద్యార్థి వీసా దరఖాస్తుదారులు, యూరప్, ఉత్తర అమెరికా నుంచి వచ్చే వారితో పోలిస్తే అధిక తిరస్కరణను ఎదుర్కొంటున్నారు. భారత స్టూడెంట్ల వీసా తిరస్కరణ ఇలా2023- 36%, 2024- 53%, 2025-61% 2025 ఫిబ్రవరి నాటికి అమెరికాలో 3,78, 787 మంది మన విద్యార్థులు ఉండగా, 2026 ఫిబ్రవరి నాటికి ఆ సంఖ్య 3,52,644కు తగ్గిపోయింది.మొత్తంగా చూస్తే.. అమెరికా కలకు పూర్తిగా తెరపడకపోయినా, ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రాధాన్యతలు మాత్రం మారుతున్నాయి. విదేశీ విద్య కోసం భారీ రిస్క్ తీసుకోవడం కంటే.. ముందుగా క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా కెరీర్‌కు బలమైన పునాది వేసుకోవడానికే కొత్త తరం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది.

## నెల్లూరు జిల్లాలో అద్భుత సన్నివేశం..

# శివలింగం చుట్టూ మూడు నాగుపాముల ప్రదక్షిణ

**- నెల్లూరు జిల్లా మనుబోలులోని కాశీ విశ్వనాథ ఆలయంలో ఘటన**

**- ప్రదక్షిణ తర్వాత ఆలయంలోని పుట్టలోకి వెళ్లిన నాగుపాములు**

**- గతంలోనూ ఇదే ఆలయంలో పలుమార్లు కనిపించిన నాగసర్పాలు**



నెల్లూరు : నెల్లూరు జిల్లాలో ఓ శివాలయంలో నేడు అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. మనుబోలు బీసీ కాలనీ సమీపంలోని శ్రీకాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో ఈరోజు ఉదయం మూడు నాగుపాములు శివలింగం చుట్టూ ప్రదక్షిణ చేస్తూ కనిపించాయి. శివలింగాన్ని చుట్టుకొని, కొద్దిసేపు అక్కడే పడగవిప్పి ఉన్న సర్పాలను చూసి భక్తులు ఆశ్చర్యపోయారు. అనంతరం ఆ మూడు పాములు ఆలయంలోనే ఉన్న పుట్టలోకి వెళ్లిపోయాయి.ఈ అరుదైన దృశ్యాన్ని కొందరు భక్తులు తమ ఫోన్లలో వీడియో తీయడంతో అది కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. శివుడికి ప్రీతిపాత్రమైన సోమవారం రోజే ఇలా మూడు నాగసర్పాలు కనిపించడం దైవ సంకేతంగా భక్తులు భావిస్తున్నారు.ఈ ఆలయంలో నాగుపాములు కనిపించడం ఇదే మొదటిసారి కాదు. గత ఏడాది మే 17న కూడా అభిషేకం తర్వాత శివలింగంపై ఓ నాగుపాము పడగవిప్పి దర్శనమిచ్చింది. అలాగే, గతేడాది అక్టోబర్‌లో నాగుల చవితి రోజున రెండు నాగుపాములు శివలింగం పక్కన కనిపించి భక్తులను ఆశ్చర్యపరిచాయి. తరచూ ఇలా నాగసర్పాలు దర్శనమివ్వడం ఆ క్షేత్ర మహత్యంగా స్థానికులు చెబుతున్నారు.

# గంజాయి స్వాధీనం

పటాన్ చెరు: సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2.3 కిలోల ఎండు గంజాయి పట్టుపడింది. పటాన్చెరు పట్టణంలో 2.3 కిలోల ఎండు గంజాయి పట్టుకొని,ఓ వ్యక్తిని పటాన్ చెరు ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసారు. ఎక్సైజ్ సీఐ శ్రవణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పటాన్చెరు పట్టణంలోని జెపి కాలనీలో నిర్వహించిన తనిఖీల్లో బీరంగూడ కు చెందిన ఇపాటి వంశీ నీ అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి సుమారు 2.3 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించారు



# భారత్ దెబ్బ... అగ్రరాజ్యం అబ్బ..!

న్యూఢిల్లీ, : అంతరిక్షంలోనే ఉపగ్రహాలను కూల్చివేసే క్షిపణి టెక్నాలజీ కలిగిన ప్రపంచంలోని నాలుగు దేశాల్లో భారత్ ఒకటి. భారత్ 2019లో అమెరికా, చైనా, రష్యాల సరసన చేరింది. అయితే, మార్చి 2019లో చేపట్టిన ఈ ప్రయోగం అగ్రరాజ్యం అమెరికాను కలవరానికి గురిచేసింది అని ఆ దేశ మాజీ నిఘా అధికారి తాజాగా వెల్లడించారు. ఆయన ఓ పాడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. భారత్ చేపట్టిన యాంటి శాటిలైట్ మిసైల్ పరీక్ష సమయంలో ఆందోళన చెందినట్లు తెలిపారు.పోఖ్రాన్–2 అణు పరీక్షలతో అమెరికాతో ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసిన భారత్.. అణుశక్తిలో తాము ఏమాత్రం తీసిపోమని నిరూపించింది. ఇది జరిగిన దాదాపు 28 ఏళ్ల తర్వాత అగ్రరాజ్యానికి భారత్ అలాంటి సర్‌ప్రైజ్ ఇచ్చింది. మార్చి 27, 2019 భారత్ చేపట్టిన 'మిషన్ శక్తి' ( యాంటీ శాటిలైట్ క్షిపణి ప్రయోగం అమెరికా నిఘా వర్గాలను తీవ్రగ్భ్రాంతికి గురిచేసింది. దీనికి సంబంధించిన వివరాలను అమెరికా వాయుసేన మాజీ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ డేవిడ్ గ్రుష్ తాజాగా ప్రముఖ పాడ్‌కాస్టర్ జో రోగన్ ఇంటర్వ్యూలో వెల్లడించారు. అప్పట్లో నేషనల్ రీకాన్నార్చ్ ఆఫీస్ ఆపరేషన్స్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న గ్రుష్.. ఆ సమయంలో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకున్నారు."ఇది ఒక విచిత్రం... 2019లో ఎవరూ ఊహించని విధంగా భారత్ నిర్వహించిన క్షిపణి పరీక్ష వారి ఉపగ్రహాలలో ఒకదానిని తాకింది.. ఈ విషయం గురించి వారు మాకు ముందు తెలియజేయలేదు" అని ఆయన అన్నారు. ఒడిశా తీరంలో భారత్ క్షిపణి పరీక్షకు సంబంధించి నోటీసు జారీ చేసినప్పటికీ.. అది ఉపగ్రహాన్ని పేల్చివేసే 'యాయ' క్షిపణి అని అమెరికా ఊహించలేకపోయింది. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగించే వరకు దీనిపై ఎవరికీ అవగాహన లేదు.ఈ ప్రయోగం వల్ల ఏర్పడిన అంతరిక్ష వ్యర్థాల నుంచి తమ నిఘా ఉపగ్రహాలకు ప్రమాదం పొంచి ఉందేమోనని ఎన్ఆర్వో అధికారులు తీవ్ర ఆందోళన చెందారని ఆయన అన్నారు. వెంటనే వ్యర్థాల విస్తరణను లెక్కించి, అమెరికా ఉపగ్రహాల మార్గాన్ని మార్చాల్సిన అవసరం ఉందో లేదో చూడాలని విశ్లేషకులను ఆదేశించినట్లు గ్రుష్ తెలిపారు.ప్రయోగంలో భాగంగా భారత్ తన ఉపగ్రహం 'మైక్రోశాట్–ఆర్' ను నింగిలోనే విజయవంతంగా కూల్చివేసింది. దీంతో అంతరిక్షంలోనే ఉపగ్రహాలను ధ్వంసం చేసే వ్యూహాత్మక సామర్థ్యం కలిగిన అమెరికా, రష్యా, చైనాల సరసన భారత్ చేరింది. ఈ ప్రయోగం తక్కువ భూకక్ష్యలో జరిగిందని, ఏర్పడిన వ్యర్థాలు కొన్ని వారాల్లోనే నశిస్తాయని, అంతరిక్షంలో ఆయుధాల పోటీలో పాల్గొనే ఉద్దేశం భారత్‌కు లేదని విదేశాంగ శాఖ అప్పట్లోనే స్పష్టం చేసింది.భారత్ క్షిపణి ప్రయోగంపై నిఘా పెట్టేందుకు డియెగో గార్సియా బేస్ నుంచి అమెరికా వైమానిక దళ విమానం బంగాళాఖాతం మీదుగా వచ్చిందని 'ఎయిర్‌క్రాఫ్ట్ స్పాట్స్' నివేదించింది. అయితే తమ ఆస్తులేవీ భారత్‌పై గూఢచర్యం చేయలేదని అమెరికా రక్షణ శాఖ అప్పట్లో ప్రకటించినప్పటికీ.. గ్రుష్ చెప్పిన విషయాలను బట్టి ఈ ప్రయోగం అమెరికాకు పూర్తిగా ఊహించని షాక్ అని స్పష్టం చేస్తున్నాయి.

## 'వీధి కుక్కలు, కోతుల నుండి కాపాడండి మహాప్రభో'

**- బూర్గంపహాడ్ ప్రజల వేడుకోలు**

బూర్గంపహాడ్, అక్టోబర్ 05 : బూర్గంపహాడ్‌లో వీధి కుక్కలు, కోతుల నుండి కాపాడాలంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. బూర్గంపహాడ్ గ్రామ పంచాయతీ వీధిలో కుక్కలు, కోతుల సంచారం రోజురోజుకు పెరిగిపోతుండడంతో ప్రజలు, ఆయా పాఠశాలలు, వసతి గృహాలకు వెళ్లే విద్యార్థినీ, విద్యార్థులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ప్రాథమికోన్నత పాఠశాల–2 వీధి, పెద్దమసీదు బజారు, చిన్నమసీదు, ప్రెస్ క్లబ్ బజార్లతో పాటు పలు ఏరియాల్లో కుక్కల బెడద విపరీతంగా ఉందని, మరోపక్క కోతులు సైతం ప్రజలపై దాడులు చేస్తున్నాయని, చిన్నారులను సైతం తల్లిదండ్రులు వీటి బెడదతో బడులకు సైతం పంపలేకపోతున్నట్లు వాపోతున్నారు. పంచాయతీ పాలకవర్గం, సంబంధిత అధికారులు స్పందించి కుక్కలను నిర్మూలించి, కోతులను సమీప అటవీ ప్రాంతాల్లో వదిలి వేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

# వివేకా హత్య కేసులో జగన్ మౌనం నేరాంగీకారమే

**- కడప టికెట్ కోసం రూ.40 కోట్ల సుపారీ ఇచ్చారని జగన్‌పై తీవ్ర ఆరోపణలు**

**- రాయలసీమ, ప్రకాశం జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు**

**- పల్లె పండుగ 3.0, జలజీవన్ మిషన్‌తో రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగవంతం**

**- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ**

అమరావతి,: సొంత బాబాయ్ వైఎస్ /వివేకానంద రెడ్డి హత్య కేసులో దర్యాప్తు సంస్థలన్నీ ఆధారాలతో తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపిస్తున్నప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి జగన్ మౌనం వహించడం ఆయన నేరాన్ని అంగీకరించడమేనని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కడప ఎంపీ టికెట్ కోసం ఏకంగా రూ.40 కోట్ల సుపారీ ఇచ్చి సొంత కుటుంబాన్నే బలితీసుకున్న చరిత్ర జగన్‌ది కాదా అని సూటిగా ప్రశ్నించారు.ఈడీ, సీబీఐ వంటి సంస్థలు దర్యాప్తును వేగవంతం చేస్తుంటే, సమాధానం చెప్పలేక జగన్ ముఖం చాటేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని ఈ కేసును నీరుగార్చారని, పులివెందులలోకి కేంద్ర దర్యాప్తు అధికారులు రాకుండా అడ్డుకున్నది వైసీపీ ప్రభుత్వమేనని ఆయన ఆరోపించారు.

అభివృద్ధి, సంక్షేమంలో కూటమి ప్రభుత్వం పరుగులు: ఒకవైపు వైసీపీ విధ్వంసకర రాజకీయాలకు పాల్పడుతుంటే, తమ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కలిసి 61.60లక్షల కుళాయిల ద్వారా 27.36 లక్షల కుటుంబాలకు తాగునీరు అందించే 'జలజీవన్ మిషన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. 'పల్లె పండుగ 3.0' కింద రూ.1,185 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతోందన్నారు. పీఎంఏవై గ్రామీణ్ 2.0 ద్వారా రాష్ట్రంలో రూ.7,170 కోట్లతో పేదలకు మూడు లక్షల పక్కా ఇళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం సెంటున్నర స్థలం పేరుతో భూదందాలకు పాల్పడితే, తాము పారదర్శకంగా సంక్షేమ ఫలాలను అర్హులకు అందిస్తున్నామని స్పష్టం చేశారు.

రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ: రాయలసీమ సాగునీటి కష్టాలను తీర్చడానికి ఎన్టీఆర్ హంద్రీ–నీవా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తే, చంద్రబాబు తన పాలనలో నిధులు కేటాయించి కుప్పం వరకు కృష్ణా జలాలనుతీసుకువచ్చారని రాంప్రసాద్ రెడ్డి గుర్తుచేశారు. రాయలసీమతో పాటు ప్రకాశం జిల్లాను కలుపుకొని పది జిల్లాలను 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందన్నారు. హైదరాబాద్‌లో ఐఎస్‌బీని ఏర్పాటు చేసిన స్ఫూర్తితో, మంత్రి నారా లోకేశ్ చొరవతో దేశంలోనే తొలిసారిగా 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'నురాష్ట్రానికి తీసుకువస్తున్నామని వెల్లడించారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట: తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ బీసీలకు అండగా నిలుస్తుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు, అధిక స్థానాలను కేటాయించడానికి కట్టుబడి ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. గత వైసీపీ పాలనలో దౌర్జన్యాలతో స్థానిక సంస్థలను కైవసం చేసుకున్నారని, ఇప్పుడు చట్టబద్ధంగా, పారదర్శకంగా ఎన్నికలు జరుగుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వ సుపరిపాలన, అభివృద్ధి, మెరుగైన శాంతిభద్రతలే తమకు శ్రీరామరక్ష అని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి చంద్రబాబుకు ఘన విజయాన్ని కానుకగా అందిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# బుడ్డగూడెంలో జోరుగా ఇసుక అక్రమ రవాణా



బూర్గంపహాడ్, అక్టోబర్ 05 : బూర్గంపహాడ్ మండల పరిధిలోని బుడ్డగూడెం కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. బుడ్డగూడెం పరిసర ప్రాంతాల్లో కిన్నెరసాని వాగు నుండి ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణా జరుగుతున్నా తనిఖీలు చేయడంలో, చర్యలు తీసుకోవడంలో అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. రాత్రి వేళల్లో బుడ్డగూడెం పరిసర ప్రాంతాల్లో ట్రాక్టర్లు, భారీ వాహనాలు పెద్ద సంఖ్యలో అక్రమ ఇసుక రవాణాతో రాకపోకలు సాగిస్తున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. బుడ్డగూడెంలో ఇద్దరు వ్యక్తులు అక్రమ ఇసుక వ్యాపారాన్ని యధేచ్ఛగా నిర్వహిస్తూ ఎవరైతే మాకేంటి, తమ వ్యాపారానికి అడ్డూ అదుపూ లేదంటూ ఇసుక వ్యాపారంలో లక్షలు గడిస్తున్నారు. అక్రమ ఇసుక వ్యాపారం వల్ల రాత్రిళ్లు పెద్ద పెద్ద శబ్దాలతో వాహనాల రాకపోకలు సాగుతున్నాయని, వాహన రాకపోకలతో దుమ్ము, ధూళీ లేచి గ్రామాల్లో స్థానికులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపిస్తున్నారు. గ్రామీణ రహదారులు సైతం దెబ్బతింటున్నాయని, అక్రమ ఇసుక వ్యాపారంపై అధికారులు స్పందించి ఇసుకాసురులపై కఠినచర్యలు తీసుకోవాలని బుడ్డగూడెం పరిసర ప్రాంతవాసులు వేడుకుంటున్నారు.

# సిరిసిల్ల పూర్తయింది... ఇక సిద్ధిపేట..?



మెదక్,: ఉమ్మడి కరీంనగర్, మెదక్ జిల్లాల్లో గులాబీ పార్టీ బలమైన అడ్డాగా ఉన్న నియోజకవర్గాలపై వ్యూహాత్మకంగా దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సిరిసిల్ల సభ తర్వాత తన తదుపరి పొలిటికల్ టార్గెట్‌గా సిద్ధిపేటను ఎంచుకోవడం తెలంగాణ రాజకీయంలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లపై నిధుల వర్షం కురిపిస్తూనే రాజకీయ విమర్శలతో దాడి చేసిన సీఎం రేవంత్, ఇప్పుడు బిఆర్ఎస్ ట్రబుల్ షూటర్ హరీష్ రావు స్వక్షేత్రమైన సిద్ధిపేటలో భారీ బహిరంగ సభకు సిద్ధమవుతున్నారు. అయితే, సిరిసిల్ల రాజకీయ సమీకరణలతో పోలిస్తే సిద్ధిపేట గడ్డపై బిఆర్ఎస్‌ను ఢీకొట్టడం కాంగ్రెస్‌కు అంత సులువైన విషయం కాదన్నది ప్రాథమిక అంచనా. సిద్ధిపేట నియోజకవర్గం దశాబ్దాలుగా గులాబీ జెండాకు తిరుగులేని బలమైన కోటగా ఉంది. 1985లో తొలిసారిగా కేసీఆర్ ఇక్కడి నుంచి గెలిచిన నాటి నుంచి నేటి వరకు ఈ నియోజకవర్గం కేసీఆర్ కుటుంబం చేతుల్లోనే ఉంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా రాష్ట్ర స్థాయి రాజకీయాలకు పరిమితమైన తర్వాత, సిద్ధిపేట బాధ్యతలను స్వీకరించిన హరీష్ రావు నియోజకవర్గాన్ని కేవలం ఒక రాజకీయ స్థానంగా కాకుండా తన సొంత ఇల్లుగా మార్చుకున్నారు. వరుసగా ఆరుసార్లు రికార్డు స్థాయి భారీ మెజార్టీలతో విజయం సాధించడమే కాకుండా, ప్రత్యర్థి పార్టీల ఉనికిని కూడా ప్రశ్నార్థకం చేసే స్థాయికి నియోజకవర్గంలో పట్టు సాధించారు. హరీష్ రావు రాజకీయ విజయంలో ప్రధాన బలం ఆయన పెంపొందించుకున్న వ్యక్తిగత అనుబంధం, నిరంతర అందుబాటు . సిద్ధిపేటలోని ప్రతి గ్రామంలోనూ, ప్రతి వార్డులోనూ హరీష్ రావుకు సొంత కేడర్ ఉంది. ప్రతీ శుభకార్యానికి లేదా అశుభకార్యానికి పలకరించే స్థాయి కార్యకర్తల నెట్‌వర్క్, నియోజకవర్గంలోని ప్రతి కుటుంబంతో ఏదో ఒక రూపంలో నేరుగా కనెక్టివిటీ ఉండటం ఆయనకు శ్రీరామరక్షగా మారింది. దానికి తోడు మంత్రిగా పనిచేసిన సమయంలో రంగనాయక సాగర్ జలాశయం, వైద్య కళాశాల, ఐటీ పార్కు, మోడల్ బస్టాండ్ వంటి ప్రాజెక్టులతో సిద్ధిపేటను అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దడం ఆయన బలాన్ని మరింత ద్విగుణీకృతం చేసింది. సిద్ధిపేటలో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకంగా అత్యంత బలహీనమైన స్థితిలోనే ఉందనేది వాస్తవం. ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి స్థానిక స్థాయిలో గులాబీ పార్టీ పట్టును తట్టుకోగల బలమైన, జనాకర్షణ కలిగిన నాయకత్వం కరువైంది. సిరిసిల్లలో చేరికలు లేదా అంతర్గత విభేదాలను ఆసరాగా చేసుకుని విమర్శలు గుప్పించే వెసులుబాటు కాంగ్రెస్‌కు ఉన్నప్పటికీ, సిద్ధిపేటలో హరీష్ రావు కేడర్‌ను లేదా ఓటు బ్యాంకును చీల్చడం కాంగ్రెస్‌కు పెద్ద సవాలు. దీంతో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ ఎంత భారీ స్థాయిలో నిర్వహించినప్పటికీ, అది స్థానిక రాజకీయ సమీకరణలను ఎంతవరకు ప్రభావితం చేస్తుందనేది ప్రశ్నార్థకమే సీఎం రేవంత్ రెడ్డి వ్యూహం కేవలం ఎన్నికల విజయం కోసమే కాకుండా, బిఆర్ఎస్ ప్రధాన నాయకత్వంలో మానసిక అభద్రతాభావాన్ని పెంచడమే లక్ష్యంగా కనిపిస్తోంది. హరీష్ రావు అసెంబ్లీలో ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్న తరుణంలో, ఆయన సొంత నియోజకవర్గంలోనే బహిరంగ సభ పెట్టి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో పాటు రాజకీయంగా సవాల్ విసరడం ద్వారా రేవంత్ రెడ్డి డిఫెన్సివ్ రాజకీయాల కంటే ఎదురుదాడి రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని స్పష్టమవుతోంది. ముఖ్యంగా కాంగ్రెస్ కేడర్‌లో ధైర్యం నూరిపోసి, భవిష్యత్తు స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీకి ఊపిరి పోయడం కూడా ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. సిరిసిల్ల తరహాలో సిద్ధిపేటను ఒకే దెబ్బతో డిఫెన్స్‌లో పడేయడం రేవంత్ రెడ్డికి ఏమాత్రం సులభం కాదు. హరీష్ రావు నిర్మించుకున్న వ్యక్తిగత సంబంధాలు, అభివృద్ధి మార్కు , తిరుగులేని సంస్థాగత నిర్మాణం ముందు కాంగ్రెస్ కమ్యూనికేషన్ వ్యూహాలు ఎంతవరకు పారుతాయనేది వేచి చూడాలి. సభ ద్వారా కాంగ్రెస్ కొంత సంచలనం సృష్టించినప్పటికీ, సిద్ధిపేట 'కోట'ను బద్దలు కొట్టాలంటే కేవలం బహిరంగ సభలు మాత్రమే సరిపోవని, సుదీర్ఘమైన క్షేత్రస్థాయి వ్యూహం అవసరమని భావిస్తున్నారు.

## 'గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి'

### - బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సంకుబాపన అనుదీప్



రుద్రంపూర్, అక్టోబర్ 05 : ఉమ్మడి ఖమ్మం-వరంగల్-నల్లగొండ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు కేంద్రాన్ని బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకుడు సంకుబాపన అనుదీప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రాడ్యుయేట్ ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమైనదన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులకు సంబంధించిన ప్రభుత్వ విధానాలపై తమ అభిప్రాయాలను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తం చేసేందుకు గ్రాడ్యుయేట్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. "గ్రాడ్యుయేట్ ఓటు కేవలం ఓటు మాత్రమే కాదు.. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే ప్రజాస్వామ్య హక్కులో ఒక ముఖ్యమైన సాధనం" అని ఆయన అన్నారు. అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటును తప్పనిసరిగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఓటర్ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించడంతో పాటు, నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హత కలిగిన గ్రాడ్యుయేట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని అనుదీప్ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు బానోత్ రాందాస్, గుమ్మడి సాగర్, పూల రవీందర్, బోనగిరి శ్రీకాంత్, అలాగే బావు సతీష్, రామంచి శ్రీనివాస్, కళాకోటి ఐలయ్య, తాతారావు, బేతాళ కుమార్ పాల్గొన్నారు.

# ఎల్ నినో ఎఫెక్ట్.. కొత్త జాబ్ కార్డు రెడీ

హైదరాబాద్, అక్టోబరు 5,: ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గ్రామీణ కూలీలకు నిరంతర ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త జాబ్‌కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. వీబీ జీరాంజీ పథకం కింద కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి 15 రోజుల్లోనే కార్డులు అందించాలని ఆదేశించింది. ఇప్పటికే 18 జిల్లాల్లోని 265 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. పంటల సాగు తగ్గడంతో కూలీలకు పనులు, ఆదాయం తగ్గిన నేపథ్యంలో ప్రతి గ్రామంలో రోజుకు 100 నుంచి 150 మందికి ఉపాధి కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గ్రామీణ కూలీలకు నిరంతర ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వీబీ జీరాంజీ పథకం కింద కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి జాబ్‌కార్డులు త్వరగా జారీ చేయాలని నిర్ణయించింది. కొత్త దరఖాస్తుదారులకు 15 రోజుల్లోనే జాబ్‌కార్డు అందించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పటికే 18 జిల్లాల్లోని 265 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో పంటల సాగు తగ్గింది. దీంతో వ్యవసాయ పనులపై ఆధారపడే కూలీలకు పనిదినాలు తగ్గి ఆదాయం కోల్పోయే పరిస్థితి ఏర్పడినట్లు ప్రభుత్వం నిర్ధారించింది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ప్రస్తుత జాబ్‌కార్డుదారులతో పాటు కొత్తగా ఉపాధి కోరుకునే వారిని కూడా నమోదు చేయాలని సూచించింది. గ్రామాల్లో ఉపాధి అవసరమున్న కుటుంబాలను గుర్తించి వారికి పనులు కల్పించేలా కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రతి గ్రామం నుంచి రోజుకు 100 నుంచి 150 మందికి ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. వ్యవసాయ పనులు తగ్గిన సమయంలో గ్రామీణ కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా ఉపాధి హామీ పనులు అందుబాటులో ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు. ముఖ్యంగా కరవు ప్రభావిత మండలాల్లో ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 52.46 లక్షల కుటుంబాలకు చెందిన 1.08 కోట్ల మంది జాబ్‌కార్డులు కలిగి ఉన్నారు. వీరికి కొనసాగుతున్న ఉపాధి అవకాశాలతో పాటు కొత్తగా పనులు కోరుకునే కుటుంబాలను కూడా పథకంలోకి తీసుకురావడం ద్వారా కరవు పరిస్థితుల్లో ఆదాయ నష్టాన్ని కొంతమేర తగ్గించాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా ఉంది. 18 ఏళ్లు నిండిన గ్రామీణులు జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం నిర్ణీత దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి ఆధార్‌కార్డు, ఫొటోను జత చేయాలి. సంబంధిత పత్రాలతో దరఖాస్తును గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమర్పించాలి. కార్యదర్శి దరఖాస్తును పరిశీలించిన అనంతరం మండల కార్యాలయానికి పంపిస్తారు. మండల స్థాయిలో ఎంపీడీవో దరఖాస్తు, సంబంధిత పత్రాలను పరిశీలించి అర్హతను నిర్ధారిస్తారు. అనంతరం జాబ్‌కార్డు జారీ చేస్తారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి ఈ ప్రక్రియను వేగవంతం చేసి 15 రోజుల్లోనే కార్డు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. వర్షాభావ పరిస్థితుల్లో వ్యవసాయ పనులు తగ్గినప్పటికీ గ్రామీణ కుటుంబాలకు ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉండేలా చేయడం ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ముఖ్యంగా కరవు ప్రభావిత ప్రాంతాల్లో స్థానికంగా పనులు కల్పించడం ద్వారా కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే అవసరాన్ని తగ్గించే అవకాశం ఉంది.

## రూ.4 లక్షలు లంచం.. ఏసీబీకి చిక్కిన టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్..!

హైదరాబాద్, : రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ దాడుల్లో వరసగా అక్రమార్కులు పట్టుబడుతున్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లాలో డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న స్వర్ణకుమారి లక్ష రూపాయల లంచం తీసుకున్న ఘటన మరవకముందే టౌన్ ప్లానింగ్ అధికారిణి ఏసీబీ అధికారులకు పట్టుబడింది. జీహెచ్‌ఎంసీ గోల్కొండ జోన్‌లో పట్టణ ప్రణాళిక సూపర్‌వైజర్‌గా సేవలందిస్తున్న తులసీరాం సునీత రూ. 4 లక్షల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికింది. అవినీతి నిరోధక శాఖ వరసగా జరుపుతున్న దాడుల్లో మరో ప్రభుత్వ అధికారిని పట్టుబడింది. జీహెచ్‌ఎంసీ గోల్కొండ జోన్‌లో పట్టణ ప్రణాళిక సూపర్‌వైజర్‌గా సేవలందిస్తున్న తులసీరాం సునీత రూ. 4 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికింది. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ అదేశాలను బేఖాతరు చేస్తూ.. భవన నిర్మాణదారుడికి అధికారికంగా లబ్ధి చేకూర్చడం కోసం రూ. 8 లక్షలు లంచం డిమాండ్ చేసింది సునీత. సోమవారం ఫిర్యాదుదారు నుంచి నాలుగు లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ బృందం ఆమెను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. సునీత ఆఫీసులో సోదాలు చేయగా లభించిన రూ. 2.5లక్షలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమాలకు పాల్పడిన సునీతను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు ఆమెను నాంపల్లిలోని అడిషనల్ ప్రత్యేక జడ్జి ముందు హాజరుపరిచారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉన్నందున.. భద్రతా కారణాలరీత్యా ఫిర్యాదుదారు వివరాలను వెల్లడించడం లేదని ఏసీబీ పేర్కొంది.

## నోవా మెడికల్ కాలేజీ గుర్తింపు రద్దు చేయాలి.. గెల్లు శ్రీనివాస్ యాదవ్ డిమాండ్

హైదరాబాద్, : నిబంధనలకు అనుగుణంగా మౌలిక వసతులు లేనప్పటికీ నోవా మెడికల్ కాలేజీకి ఇచ్చిన గుర్తింపును రద్దు చేయాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ), రాష్ట్ర వైద్యశాఖ, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయ అధికారుల తీరుపై విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు, మీడియా ప్రతినిధులు నోవా మెడికల్ కాలేజీని సందర్శించారు. కాలేజీ యాజమాన్యాన్ని ప్రశ్నిస్తున్న సమయంలో పోలీసులు జోక్యం చేసుకుని వారిని అదుపులోకి తీసుకుని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



రాజన్న సిరిసిల్ల, మరో సంచలనం, (అక్టోబర్ 05): సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించి.. ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 115 అర్జీలు రాగా, సంబంధిత అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 1 దరఖాస్తు రాగా, సంబంధిత అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు. వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 03 దరఖాస్తులు రాగా, సంబంధిత అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01 గంట వరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01 గంట వరకు ప్రజావాణి ఎంపీడీఓలు నిర్వహించి.. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండలాల వారీగా దరఖాస్తులు వివరాలు..బోయినపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి 02, చందుర్తి మండలం 02, ఇల్లంతకుంట మండలం 03, గంభీరావుపేట మండలం 06, కోనరావుపేట మండలం 06, ముస్తాబాద్ మండలం 07, రుద్రంగి మండలం 00, తంగళ్లపల్లి మండలం 04, వీర్నపల్లి మండలం 02, వేములవాడ అర్బన్ మండలం 03, వేములవాడ రూరల్ మండలం 07, ఎల్లారెడ్డిపేట ఎంపీడీఓ కార్యాలయానికి 01 చొప్పున వచ్చాయి. మండల, డివిజన్ స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తో పాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాలు, అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుందని, స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అన్ని చోట్ల అప్లికేషన్లు ఆన్లైన్ చేస్తారని పేర్కొన్నారు. ఐడీఓసీ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ

### – ఇన్‌పుట్స్ పంపిణీ చేసిన కేవీకే






రుద్రంపూర్, అక్టోబర్ 05 : భద్రాద్రి కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు కింద రైతులకు శిక్షణ కార్యక్రమంతో పాటు సహజ వ్యవసాయ ఇన్‌పుట్స్ పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం కేవీకే ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలోసహాయ వ్యవసాయసంచాలకులు(టెక్నికల్),సహజ వ్యవసాయ ప్రాజెక్టు నోడల్ అధికారి శోభన్‌బాబు పాల్గొని ప్రకృతి వ్యవసాయంలో ఉపయోగించే వివిధ ఉత్పత్తులు, వాటి వినియోగం, ప్రాజెక్టు లక్ష్యాలు, చేపడుతున్న కార్యకలాపాలను రైతులకు వివరించారు.

నేల ఆరోగ్య పరిరక్షణ కీలకం: కేవీకే భద్రాద్రి కొత్తగూడెం సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ డా. టి.భరత్ మాట్లాడుతూ సహజ వ్యవసాయం ప్రాధాన్యతను వివరించారు. స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు సమగ్ర నేల ఆరోగ్య నిర్వహణపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సహజ పద్ధతుల ద్వారా సాగు చేయడం వల్ల నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు వ్యవసాయాన్ని మరింత స్థిరంగా కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో కీలకంగా ఉపయోగించే జీవామృతం తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా నేర్చుకున్నారు. అనంతరం పలువురు రైతులు తాము సహజ వ్యవసాయంలో అనుసరిస్తున్న పద్ధతులు, ఎదురైన అనుభవాలు, సాధించిన విజయాలను ఇతర రైతులతో పంచుకున్నారు.

20 మంది రైతులకు ఇన్‌పుట్స్ పంపిణీ: కార్యక్రమం ముగింపులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 20 మంది ప్రకృతి వ్యవసాయ రైతులకు ఇన్‌పుట్స్ పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయంలో అవసరమైన ఉత్పత్తులను రైతులే తయారు చేసుకుని వినియోగించేలా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో డ్రమ్స్, పప్పుల పొడి, వేపనూనె, బెల్లం తదితరాలను అందజేశారు.

## గిరిజన బాలికలకు ఫోన్ చేసి లైంగికంగా వేధించిన దుండగులు.. ఇద్దరి ఆత్మహత్యాయత్నం

వరంగల్ : వరంగల్ జిల్లా ఖానాపూర్‌లో దారుణం చోటు చేసుకుంది. ఇద్దరు గిరిజన బాలికలకు దుండగులు ఫోన్ చేసి లైంగిక వేధింపులకు గురి చేశారు. పోకిరీల వేధింపులు తాళలేక ఇద్దరు బాలికలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వారిని మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## ఉపాధ్యాయులే ఉత్తమ సమాజ నిర్మాణానికి పునాది: డా. వి. నరేందర్ రెడ్డి




చర్చా వేదిక,కరీంనగర్ (అక్టోబర్ 05) : ఉపాధ్యాయులు విద్యార్థులకు అక్షరజ్ఞానంతో పాటు విలువలు, క్రమశిక్షణ, సంస్కారం,బాధ్యతలను నేర్పించి, వారి భవిష్యత్తును తీర్చిదిద్దే మార్గదర్శకులని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉత్తమ ఉపాధ్యాయులు ఉత్తమ విద్యార్థులను, ఉత్తమ విద్యార్థులు ఉత్తమ సమాజాన్ని నిర్మిస్తారని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను నరేందర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్న నరేందర్ రెడ్డిని ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.